


# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 06-05-2022 సంపుటి: 03 సంచిక: 231 పేజీలు: 4 వెల: రూ 3-00


# టీటీడీ చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి నిర్మాణానికి సీఎం శంఖుస్థాపన



### బర్డ్ గ్రహణ మొర్రి, చెవుడు, మూగ చికిత్సల వార్డులు ప్రారంభం
### ఎస్వీబీసీ ఆన్లైన్ రేడియో లోగో ఆవిష్కరణ
### శ్రీనివాస సేతు, నగరపాలక సంస్థ సాలిడ్ వేస్ట్ మెనేజ్మెంట్ ప్లాంట్ల ప్రారంభోత్సవం

తిరుపతి, మే 05తిరుపతిలోని అలిపిరి వద్ద శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి నిర్మాణానికి శంఖుస్థాపన, బర్డ్ గ్రహణ మొర్రి, చెవుడు, మూగ చికిత్సల వార్డులు, శ్రీనివాస సేతు, నగరపాలక సంస్థ సాలిడ్ వేస్ట్ మెనేజ్మెంట్ ప్లాంట్లను గురువారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్రెడ్డి ప్రారంభించారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి టీటీడీ చైర్మన్ శ్రీ వైవి.సుబ్బారెడ్డి, ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆసుపత్రి నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి, స్మైల్ ట్రీ కాక్లియర్ ఇంప్లాంట్స్ దృశ్య మాలికను ప్రదర్శించారు. అనంతరం వైద్యులు, గుండె ఆపరేషన్లు చేయించుకున్నచిన్న పిల్లల తల్లిదండ్రులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. తరువాత ఎస్వీబిసి ఆన్లైన్ రేడియో లోగోను ఆయన ఆవిష్కరించారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి నిర్మాణానికి శంఖుస్థాపన అలిపిరి వద్ద 6 ఎకరాల స్థలంలో 300 కోట్ల రూపాయలతో 4 లక్షల 11 వేల 325 చదరపు అడుగుల విస్తీర్ణంలో టీటీడీ చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిని నిర్మించనుంది. ఇందులో ఏడు అంతస్తులు, 350 పడకలు ఉంటాయి. ఈ ఆసుపత్రిలో చిన్నారులకు అంతర్జాతీయ స్థాయిలో వైద్య సేవలు ఉచితంగా అందిస్తారు. హెమటో ఆంకాలజి, మెడికల్ ఆంకాలజి, సర్జికల్ ఆంకాలజి, న్యూరాలజి, కార్డియాలజి, నెఫ్రాలజి, గ్యాస్ట్రో ఎంట్రాలజి లాంటి 15 రకాల ప్రత్యేక విభాగాల్లో చిన్నారులకు వైద్య సేవలు, చికిత్సలు అందిస్తారు. అంతేగాక అత్యంత ఖరీదైన బోన్ మారో ట్రాన్స్ప్లాంటేషన్, హార్ట్ ట్రాన్స్ప్లాంటేషన్ మరియు ఇతర అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేస్తారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఇలాంటి ఆసుపత్రి దేశంలోనే మొదటిది కాబోతుంది. అత్యవసర పరిస్థితుల్లో ఎయిర్ అంబులెన్స్ సౌకర్యం కలిగి ఉండటం కూడా ఈ ఆస్పత్రి మరో ప్రత్యేకత. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి సంకల్పంతో గత ఏడాది తిరుపతిలో ప్రారంభించిన శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం ఎందరో చిన్నారులకు పునర్జన్మను ప్రసాదిస్తోంది. ఆసుపత్రిలో ఇప్పటికే 300 పైగా అరుదైన గుండె శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. లక్షల రూపాయల ఖర్చు భరించగలిగే ఆర్థిక స్తోమత లేని నిరుపేదల చిన్నారులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఈ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.బర్డ్ గ్రహణ మొర్రి, చెవుడు, మూగ చికిత్సల వార్డులు ప్రారంభం : మిషన్ హెల్త్ ఫర్ ఆల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తూ పేదల చెంతకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని తీసుకురావడానికి అనేక చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్మైల్ ట్రైన్ అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థతో కలిసి బర్డ్ ఆసుపత్రిలో గ్రహణ మొర్రి భాధితులకు ఉచితంగా అధునాతన చికిత్స, వైద్య సేవలను అందించడానికి ముందుకు వచ్చింది. చికిత్స తర్వాత వీరికి స్పీచ్ థెరపీ, బీహేవియరల్ కౌన్సెలింగ్ అందిస్తారు. దీనివల్ల వీరు కూడా మనోధైర్యంతో అందరిలాగే సాధారణ జీవితం గడిపే అవకాశం కలుగుతుంది. అలాగే వినికిడి లోపంతో బాధపడే చిన్నారులకు డబుల్ కాక్లియర్ ఇన్ప్లాంటేషన్ సర్జరీ, స్పీచ్ థెరపీ, బీహేవియరల్ కౌన్సెలింగ్, హియరింగ్ రిహాబిలిటేషన్ తదితర సేవలు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉ



చితంగా అందిస్తారు. పేద, మధ్య తరగతి వర్గాలకు ఈ సేవలు ఎంతో ఉపయోగపడతాయి.శ్రీనివాస సేతు : తిరుమల శ్రీవారి దర్శనార్థం ప్రపంచ నలుమూలల నుండి ప్రతి రోజు లక్షమందికి పైగా భక్తులు తిరుపతికి వస్తున్నారు. వీరికి అవసరమైన వసతులు, సదుపాయాలు కల్పించడంతో పాటు సులువుగా తిరుమలకు చేరుకునే సౌకర్యం ఏర్పాటు చేయడానికి టీటీడీ శ్రీనివాస సేతు నిర్మాణంలో కీలక భాగస్వామి అయ్యింది. తిరుపతి స్మార్ట్సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో టీటీడీ సహకారంతో 4 లైన్లతో కూడిన 7 కి.మీ పొడవు, 17మీ వెడల్పుతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.684 కోట్ల అంచనావ్యయంతో 2019 మార్చి 6న శ్రీనివాస సేతు నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి.

# విద్యా వ్యవస్థలో నాణ్యత, పరిశోధనలపై జాతీయ విద్యావిధానం ప్రత్యేక దృష్టి



### ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్
### రాజ్ భవన్ లో రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సదస్సు
### కులపతి హోదాలో విభిన్న అంశాలపై దిశానిర్దేశం

విజయవాడ, మే 5 అసమానతలు లేని సమాజం, మానవ నైపుణ్యతల పెంపే లక్ష్యంగా జాతీయ విద్యా విధానం-2020 స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతుందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ య బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. జాతీయ భావ ప్రేరేపణ, సార్వత్రిక సౌలభ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా న్యాయబద్ధమైన సమాజాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతుల 3వ సదస్సు గురువారం రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయాల కులపతి హోదాలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ప్రసంగిస్తూ నాణ్యమైన విద్యను ప్రతి ఒక్కరికీ అందించేలా విశ్వవిద్యాలయాలు దృష్టి సారించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేయడానికి కట్టుబడి ఉందని, ఉన్నత విద్యా రంగంలో అనేక సంస్కరణలను ప్రారంభించిందని గవర్నర్ అన్నారు. ఉన్నత విద్యా వ్యవస్థ సంస్థాగత స్వయం ప్రతిపత్తి వైపు పయనించవలసిన ఆవశ్యకతను జాతీయ విద్యావిధానం స్పష్టం చేస్తుందన్నారు. ఈ క్రమంలో కొన్ని కీలక మార్పుల అవశ్యకత ఉందని, పాఠ్యాంశాల పునరుద్ధరణ, బోధన, మూల్యాంకనం, విద్యార్థుల అనుసరణీయత, ఉత్తమ బోధకుల పాత్ర వంటి అంశాలు మిళితం అయి ఉన్నాయన్నారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో జాతీయ విద్యావిధానం అమలు ఒక క్రమపద్ధతిలో జరుగుతోందని, ఇంజనీరింగ్, సాంప్రదాయ డిగ్రీ కోర్సుల పాఠ్యాంశాలను రీ-డిజైన్ చేయడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు గవర్నర్ తెలిపారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలలలో గుణాత్మక పరిశోధనలను ప్రోత్సహించడానికి, పరిశోధనా పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర పరిశోధనా మండలిని ఏర్పాటు చేయడం సరైన దిశలో తొలి అడుగు వంటిదన్నారు. దేశంలో నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందని, కోర్సులో భాగంగా ఒక సంవత్సరం పరిశోధనకు కేటాయిస్తున్నారని గవర్నర్ శ్రీ హరిచందన్ అన్నారు. ఉపకులపతులు అధిక నాణ్యతతో కూడిన పరిశోధన పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి వ్యూహాలను రూపొందించాలని ఆదేశించారు. జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేసేలా విద్యావ్యవస్థ రూపుదిద్దుకోవాలన్నారు.వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య మాట్లాడుతూ వ్యవసాయ విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధన్యతను ఇస్తుందని, నిరుద్యోగ యువత ఆధునిక వ్యవసాయం వైపు ఆకర్షితులయ్యేలా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీకి అనుగుణంగా ఉన్నత విద్యావ్యవస్థను తీర్చి దిద్దుతున్నామన్నారు.

# విద్యాదీవెన గొప్ప పథకం..

### చంద్రబాబు హయంలో ఇలాంటివేమైనా అమలు అయ్యాయా?: సీఎం జగన్

తిరుపతి: చదువు అనేది ఒక మనిషి చరిత్రను, ఒక కుటుంబ చరిత్రను, ఒక సామాజిక చరిత్రను, ఒక రాష్ట్ర చరిత్రను.. అంతెందుకు ఒక దేశ చరిత్రను మారుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తిరుపతి పర్యటన సందర్భంగా.. తారకరామ స్టేడియంలో గురువారం జరిగిన విద్యాదీవెన నగదు జమ కార్యక్రమంలో పాల్గొని.. బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.ఒక మంచి కార్యక్రమం దేవుడి దయతో సాగుతోందని సీఎం జగన్ ఆనందం వ్యక్తం చేశారు. ఇది తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు సీఎం జగన్. “చదువు అనేది గొప్ప ఆస్తి.. ఎవరూ దొంగిలించలేని ఆస్తి. తలరాతలు మార్చేసే శక్తి చదువుకు ఉందని నమ్మే వ్యక్తిని నేను. 10.85 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరడం సంతోషంగా ఉంద”ని సీఎం జగన్ తెలిపారు.గత ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చింది. పాదయాత్రలో ఎన్నో కష్టాలను కళ్లారా చూశా. ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు పిల్లలను చదువుకు దూరం



చేయకూడదనుకున్నా. అందుకే.. విద్యార్థులకు లబ్ధి చేకూరే పథకాలతో గొప్ప విప్లవం తీసుకొచ్చాం అన్నారు సీఎం జగన్. విద్యాదీవెన అనేది రాష్ట్రంలోనే గొప్ప పథకం అని, అవినీతికి తావు లేకుండా నేరుగా తల్లుల అకౌంట్‌లోనే డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. అరకొర ఫీజులతో, రీయంబర్స్‌మెంట్‌లతో గత ప్రభుత్వం వ్యవహరిస్తే.. క్రమం తప్పకుండా బకాయిలు చెల్లించి మరీ విద్యా వ్యవస్థను సమర్థవంతంగా నడిపిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వానికి, మా ప్రభుత్వానికి వచ్చిన మార్పు ఏంటో మీరే గమనించడని తల్లిదండ్రులను ఉద్దేశించి సీఎం జగన్ కోరారు. అంతేకాదు గతంలోని ప్రభుత్వం.. ఇప్పుడున్న పథకాల్లాంటివి ఏమైనా ప్రవేశపెట్టిందా? అని అడిగారు సీఎం జగన్.

# ఒమిక్రాన్ లో మార్పులపై డబ్లుహెచ్ఒ ఆందోళన

జెనీవా : కరోనా వేరియంట్ ఒమిక్రాన్ లో ఉత్పరివర్తనాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ అధిపతి టెడ్రోస్ అథనామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక దేశాల్లో ఒమిక్రాన్ సబ్ వేరియంట్ బీఏ 2 ఉనికి చాటుతున్నప్పటికీ , బీఏ 4,బీఏ 5 సబ్ వేరియంట్లు దక్షిణాఫ్రికాలో కొత్త ఉప్పెనకు దారి తీస్తున్నాయని వెల్లడించారు. చాలా దేశాల్లో ఈ వైరస్ ఎలా మార్పులు చెందుతుందో తెలుసుకోలేక పోతున్నామని , తర్వాత ఏం జరుగుతుందో తెలియదని వెల్లడించారు. ఈ వేరియంట్లపై మిగిలిన దేశాలు



జన్యుక్రమాన్ని విశ్లేషించడాన్ని మానివేయగా, దక్షిణాఫ్రికా ఇంకా దానిని కొనసాగిస్తోందని, అందుకే వాటిని గుర్తించ గలిగామని వెల్లడించారు.ప్రజలను రక్షించుకోడానికి మనముందున్న మార్గం వ్యాక్సినేషన్ అని, దాంతోపాటు కొవిడ్ నియమావళిని పాటించాలని సూచించారు. ఇక ప్రపంచ వ్యాప్తంగా కరోనా కొత్త కేసులు, మరణాలు తగ్గుముఖం పడుతున్నట్టు ఈ నివేదిక పేర్కొంది. గత వారం 15 వేల మరణాలు నమోదయ్యాయి. ఈ సంఖ్య కరోనా ప్రారంభ రోజులు నాటి స్థాయికి పడిపోయినట్టు తెలిపింది. ఈ రెండేళ్ల కాలంలో 62 లక్షలకు పైగా మరణాలు సంభవించగా, వాస్తవ సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ తగ్గుదల సానుకూల పరిణామమే అయినప్పటికీ, పలు దేశాల్లో పరీక్షల సంఖ్య తగ్గడం కారణం కావొచ్చన్నారు. అలాగే అమెరికా, ఆఫ్రికా దేశాల్లో ఒమిక్రాన్ సబ్ వేరియంట్లు కారణంగా కేసులు పెరుగుతున్న విషయాన్ని ప్రస్తావించారు.

# చంద్రబాబుకు బాదుడే బాదుడు తప్పదు: మంత్రి ఆర్కే రోజా



తిరుపతి: విప్లవాత్మక మార్పులు, సంక్షేమ పథకాలతో విద్యార్థులకు అండగా నిలుస్తున్న వ్యక్తి సీఎం జగన్ అని ఏపీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. తిరుపతి తారకరామ స్టేడియంలో గురువారం జరిగిన విద్యా దీవెన సొమ్ము జమ కార్యక్రమంలో పాల్గొని ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు తీరును ఏకిపారేశారామె.“ప్రతీ పేద విద్యార్థి తాను కలలు గన్న చదువు అందుకుని.. ఆ కుటుంబాన్ని పైకి తెచ్చుకునేందుకు అవకాశం ఇచ్చినా జగనన్నకు కృతజ్ఞతలు. ఏ రాష్ట్రంలో లేని అద్భుతమైన పథకం విద్యాదీవెన. పేదోడంటే చంద్రబాబుకు అస్సలు నచ్చదు. అందుకే అన్నిరకాలుగా నరకయాతన పెట్టాడు. కానీ, మనసున్న మహరాజు జగనన్న ముఖ్యమంత్రి అయిన మొదటి రోజు నుంచే ప్రతీరోజూ సంక్షేమం గురించే ఆలోచిస్తున్నారు. ఇప్పటి విద్యార్థుల అదృష్టం.. జగనన్న ముఖ్యమంత్రిగా ఉండడం అన్నారు మంత్రి రోజా. అన్నం పెట్టిన జగనన్న, ఆసరా ఇచ్చిన జగనన్న, చదువు అందించిన జగనన్న, ఆనందం పంచిన జగనన్న, అన్నదాతలకు అండగా ఉన్న జగనన్న.. ఈ ప్రశంసలేవీ చంద్రబాబుకు సహించడం లేదు. కరువుకు ప్యాంట్ షర్ట్ వేస్తే అది చంద్రబాబే. అందుకే ఇవాళ సిగ్గులేకుండా బాదుడే బాదుడు అంటూ కార్యక్రమం మొదలుపెట్టాడు. కానీ, సీఎం జగన్ పేదలకు పెద్ద దిక్కుగా ఉంటున్నారు. వయసు తేడా లేకుండా.. కుల, వర్గాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. బాదుడే బాదుడు అంటూ ప్రచారం చేస్తున్న తెలుగు దేశం పార్టీని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే బాది పంపించారు. వాళ్ల వ్యవహారం ఇలాగే కొనసాగితే.. 2024లోనూ చంద్రబాబుకు బాదుడే బాదుడు తప్పదని సీఎం రోజా చెప్పారు. అవినీతికి తావు లేకుండా పాలిస్తున్న సీఎం జగన్.. .మంచి ఆరోగ్యం ఇవ్వడం కోసం ఈరోజు రాష్ట్రం కోసం పిల్లల కోసం ఓ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కావాలనుకున్నారని, ఇది ఆయన పెద్ద మనుసుకు నిదర్శమని అన్నారు మంత్రి రోజా.

# మానవత్వం లేని జగన్ ప్రభుత్వం : నారా లోకేశ్

అమరావతి మే 5 ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న వరుస మానవీయ సంఘటనలపై ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. ప్రభుత్వ తీరులో మార్పు రాదా అని ట్విట్టర్ వేదిక ద్వారా ప్రశ్నించారు.



రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద ఘోరమైన పరిస్థితులు ఉన్నాయని ఆరోపించారు. వరుస ఘటనలను ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదని, ఎందుకు సమీక్షించడం లేదని పేర్కొన్నారు.తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో అంబులెన్స్ నిర్వాహకుల వైఖరి మరిచిపోకముందే నెల్లూరు జిల్లా సంగం గ్రామంలో అంబులెన్స్ లేకపోవడంతో ఓ తండ్రి తన కుమారుడి మృతదేహాన్ని బైక్‌పై తీసుకెళ్లిన ఘటన చోటు చేసుకుందని అన్నారు. ఇదే జిల్లాలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం కోసం సిబ్బంది రూ.15 వేలు డిమాండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రచార వ్యామోహంతో ప్రారంభించిన వాహనాలన్నీ ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. అంబులెన్స్ నిర్వహణ విజయ సాయిరెడ్డి అల్లుడికి కట్టబెట్టాకే ఈ దారుణాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

# సంపాదకీయం

శుక్రవారం 06-05-2022

## రష్యాపై భారత్ భారీ ఆశలు

ఉక్రెయిన్- రష్యా యుద్ధంతో ముడి చమురు ధరలకు రెక్కలొచ్చాయి. ఇదే సమయంలో పశ్చిమ దేశాల ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరవుతున్న రష్యా.. కొనుగోలు దారులను ఆకర్షించే ప్రయత్నంలో భాగంగా భారీ రాయితీపై ఇంధనాన్ని విక్రయిస్తామని ప్రకటించింది. ఎన్నడూ లేనివిధంగా డిస్కౌంట్లు ఆఫర్ చేస్తోంది. రష్యా నుంచి జరుపుతున్న చమురు దిగుమతుల్లో కాస్త మార్పులు చేసేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ముందస్తు రష్యా ఆఫర్ చేసిన ధరకు కాకుండా చమురుపై మరింత రాయితీ ఇవ్వాలని, బ్యారెల్‌కు 70 డాలర్ల కంటే తక్కువకు భారత్ అమ్మాలని రష్యాను కోరిందివాస్తవానికి కోవిడ్-19 కారణంగా సప్లై చైన్‌లో ఏర్పడిన అంతరాయంతో ధరలు పెరిగాయి. ముడి చమురు ధరలు పెరుగుతున్న తరుణంలో రష్యా ముడి చమురుపై కళ్లు చెదిరే డిస్కౌంట్లు ఆఫర్ చేయడం విశేషం. ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాపై అమెరికా సహా పలు పశ్చిమ దేశాలు ఆంక్షల కొరడా ఝులిపించాయి. ఈ ఆంక్షల ప్రభావం నుంచి బయటపడేందుకు తమ వద్ద ఉన్న చమురును రాయితీపై విక్రయించేందుకు రష్యా సిద్ధమయ్యింది. దీంతో డిస్కౌంట్‌లో రష్యా చమురును కొనుగోలు చేయడానికి భారత్ ముందుకొచ్చి ఒప్పందం దిశగా అడుగులు వేస్తోంది. అయితే, రష్యా ఇస్తామన్న దానికంటే ఎక్కువ డిస్కౌంట్ భారత్ డిమాండ్ చేస్తోందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ అవకాశాన్ని అనుకూలంగా మలచుకోవడానికి పావులు కదుపుతున్నట్టు తెలిపాయి. రెండు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చల్లో కొనుగోళ్లపై ఫైనాన్సింగ్ వంటి అదనపు అడ్డంకులను అధిగమించడానికి డెలివరీ ప్రాతిపదికన బ్యారెల్ 70 డాలర్లు కంటే తక్కువ ధరకు ఇవ్వాలని భారత్ కోరుతోందని పేరు వెల్లడించడానికి నిరాకరించిన ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ 105 డాలర్లకు చేరిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి చివరి వారంలో ఉక్రెయిన్ యుద్ధం ఆరంభమైన తర్వాత రష్యా నుంచి భారత్ 40 మిలియన్ల బ్యారెళ్లకుపైగా ముడిచమురును దిగుమతి చేసుకుందని పేర్కొన్నాయి. బ్లూమ్‌బెర్గ్ అంచనాల ప్రకారం.. 2021లో రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న చమురు కంటే ఇది 20 శాతం అధికం. భారత్ చమురు వినియోగంలో 85 శాతం కంటే ఎక్కువ దిగుమతి చేసుకుంటుంది. రష్యాకు కీలకమైన ఆదాయ వనరు ముడి చమురును ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న కొద్ది మందిలో భారత్ ఒకటి. ఆంక్షల కారణంగా ఐరోపా దేశాలు క్రమంగా కొనుగోలును తగ్గించేయడంతో రష్యా చమురు పరిశ్రమ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ ఏడాది ఉత్పత్తి 17% వరకు తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రష్యా నుంచి భారత్ డిస్కౌంట్‌లో ఆయిల్ కొనుగోలుపై ఆంక్షల ప్రభావం లేదు. అయితే, సముద్ర బీమా వంటి అంశాలలో అంతర్జాతీయ నిబంధనలు కఠినతరం సహా భారత్‌పై అమెరికా ఒత్తిడి వాణిజ్యాన్ని మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. చమురుపై భారీ డిస్కౌంట్ పొందే అవకాశం ఉండటంతో అమెరికా వంటి దేశాల ఒత్తిడి చేస్తున్నా భారత్ వెనక్కు తగ్గడం లేదు. ఆయుధాల దిగుమతుల విషయంలోనూ రష్యాపై భారత్ కూడా ఎక్కువగా ఆధారపడి ఉంది. భారత్ డిమాండ్‌ను అంగీకరించి ముడి చమురును రష్యా డెలివరీ చేస్తే ప్రభుత్వ రిఫైనరీలు నెలకు 15 మిలియన్ బ్యారెళ్లు అంటే దిగుమతుల్లో పదో వంతు పొందుతాయి. ఈ ఒప్పందం ద్వారా ప్రయోజనం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ వంటి ప్రైవేట్ రిఫైనర్‌లు ఎవరికి వారు నేరుగా కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒపెక్( ఓపీఈసీ) దేశాల నుంచి రిస్క్‌ను ఎదుర్కొనే అవకాశం ఉన్నందున ఈ మేరకు ప్రతిపాదన చేసింది. కాగా, ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ఒక బ్యారెల్ ధర సుమారు 108 డాలర్లు ఉంది. ఇప్పటికే భారత ప్రభుత్వ, ప్రైవేట్ ఆయిల్ సంస్థలు రష్యా రాయితీ ప్రకటించడంతో 40 మిలియన్ బ్యారెల్స్ ముడి చమురును కొనుగోలు చేశాయి. అంతర్జాతీయ ఆంక్షల నేపథ్యం కారణంగా.. ఆయిల్ వ్యాపారం రష్యాకు మరింత కఠినంగా మారింది. అంతేకాకుండా ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మరో కొనుగోలుదారుడితో తమ వ్యాపార లావాదేవీలు అంత సులువుగా రష్యా జరపలేదు. ఈ సమయంలో రష్యా నుంచి జరుపుతున్న దిగుమతుల కారణంగా భారత్ భవిష్యత్తులో వాణిజ్య పరంగా ఇతర దేశాలతో ఇబ్బందులు ఎదుర్కునే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బ్యారెల్‌కు 70 డాలర్ల కంటే తక్కువకు చమురును అమ్మాలని రష్యాను భారత్ కోరుతోంది. కాగా ఈ ప్రతిపాదనకు రష్యా నుంచి ఎలా స్పందన రాబోతోందో చూడాలి.

## సమీక్షలకు దూరంగా మంత్రి

విజయవాడ, మే 5, రాష్ట్రంలో ఓ పక్క శాంతి భద్రతల పరిస్థితి అధ్వానంగా తయారై అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అన్న అనుమానం కలుగుతుంటే.. మరో పక్క అత్యంత కీలకమైన విద్యాశాఖ మంత్రి ఉన్నట్టా లేనట్టా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. అసలు బొత్స సత్యనారాయణ విద్యాశాఖ మంత్రేనా అని పలువురు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఏపీ మంత్రి వర్గ విస్తరణలో భాగంగా సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణను గత మునిసిపల్ శాఖ నుంచి మార్చి విద్యాశాఖ ఇచ్చారు ముఖ్యమంత్రి జగన్. తనకు ప్రాధాన్యత లేని శాఖ ఇచ్చారని బొత్స అలిగారని చెబుతున్నారు. మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ జరిగి పక్షం రోజులు గడుస్తున్నా.. ఆయన అలక వీడలేదు. మంత్రిగా బాధ్యతలు చేపట్టలేదు. సీఎంను కలుద్దామన్న ఆయన ప్రయత్నాలు ఫలించలేదని అంటున్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగిన అనంతరం ఇప్పటి వరకూ విద్యాశాఖకు సంబంధించి కనీసం నాలుగు సమీక్షలు జరిగాయి.. వాటి వేటికీ బొత్స సత్యనారాయణ హాజరు కాలేదు. ఈ మధ్య కాలంలో ఆయన అడపాదడపా విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. ఏ సందర్భంలోనూ కూడా విద్యాశాఖకు సంబంధించి ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. రాష్ట్రంలో ప్రస్తుతం టెన్త్ పరీక్షలు జరుగుతున్నాయి. టెన్త్ క్వశ్చన్ పేపర్లు లీకౌతున్నాయి. అయినా బొత్స నోరు మెదపడం లేదు. ఆయన ప్రమేయం లేకుండానే టీచర్ల సస్పెన్షన్లు జరుగుతున్నాయి. ముందు ముందు ఇంటర్ పరీక్షలు జరగాల్సి ఉంది. వచ్చే నెలలో విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది. విద్యాశాఖకు అత్యంత కీలకమైన సమయం ఇది. ఇటువంటి సమయంలో ఆ శాఖ మంత్రి అంటీముట్టనట్టు వ్యవహరిస్తుంటే పరిస్థితి ఏమిటిఅయినా ఒక కీలక శాఖకు చెందిన మంత్రి ఇన్ని రోజులుగా పదవీ బాధ్యతలు చేపట్టకుండా తన నిరసన వ్యక్తం చేస్తుంటే సీఎం పట్టనట్టుగా ఎందుకు వ్యవహరిస్తున్నారు. నిజంగానే ప్రభుత్వం దృష్టిలో విద్య అన్నది అప్రధాన్య అంశమా? విద్యార్థుల మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అనంతరం రాష్ట్రంలో పాలన మరింత అస్తవ్యస్థమైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుభవజ్ఞులకు అప్రధాన్య శాఖలు, కొత్తవారికి కీలక శాఖలు అప్పగించిన ఫలితం పాలనపై ప్రస్ఫుటంగా కనిపిస్తున్నదని పార్టీ వర్గాలే అంటున్నాయి. ఏ సమస్యపైనైనా స్పందించి ప్రభుత్వ వాదనను వినిపించే సీనియర్లు అలుకబూని మౌనంగా ఉండటంతో మొత్తం ప్రభుత్వంలోనే స్తబ్దత ఏర్పడిందని అంటున్నారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అన్న అనుమానం కలుగుతోందని అంటున్నారు. ఏం ఉన్నా లేకపోయినా విపక్షంపై విరుచుకుపడుతూ విమర్శలు గుప్పించే కొడాలి నాని, పేర్ని నాని వంటి వారు మంత్రిపదవులు కోల్పోయి మౌనంతో తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తుంటే.. బొత్స వంటి వారు బాధ్యతలు చేపట్టకుండా తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పుడు రాజధానే కాదు..ప్రభుత్వమూ లేని రాష్ట్రంగా మారిపోయిందని పరిశీలకులు అంటున్నారు.

## ముద్రగడకు రాజ్యసభ సీటు..?



కాకినాడ, మే 5, ముద్రగడ పద్మనాభంకు జగన్ అవకాశమివ్వనున్నారా? ఆయనకు రాజ్యసభ పదవి ఇవ్వాలని జగన్ ఆలోచిస్తున్నారా? అంటే అవుననే అనిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికలను పవన్ కల్యాణ్ ను ధీటుగా ఎదుర్కొనాలంటే ముద్రగడ పద్మనాభంను దరి చేర్చుకోవడం మార్గమని జగన్ విశ్వసిస్తున్నారు. ముద్రగడ పద్మనాభాన్ని పార్టీలో చేర్చుకునేందుకు జగన్ సుముఖంగా ఉన్నారని, త్వరలోనే ఆయనను వైసీపీ కాపు నేతలు కలుస్తారని ప్రచారం జరుగుతుంది. ఎవరు అవునన్నా కాదన్నా ముద్రగడ పద్మనాభం కాపు సామాజికవర్గంలో బలమైన నేత. ఒక విధంగా చెప్పాలంటే పవన్ కల్యాణ్ కంటే ముద్రగడ పద్మనాభంను కాపు సామాజికవర్గం ప్రజలు ఎక్కువగా విశ్వసిస్తారు. కాపు సామాజికవర్గం కోసం ముద్రగడ పద్మనాభం గత కొన్ని సంవత్సరాలుగా పోరాటం చేసిన తీరును వారు గుర్తుంచుకుంటారు. వంగవీటి రంగా తర్వాత కాపు సామాజికవర్గం ఎక్కువగా ప్రేమించేది, గౌరవించేది ముద్రగడ పద్మనాభంను మాత్రమే. అయితే వైసీపీలో బలమైన కాపు నేతలు ఎవరూ లేరు. ఉన్నా వారి నియోజకవర్గాలకే ప్రభావం చేసే వారు ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో బలమైన నేత లేరు. వంగవీటి రాధా టీడీపీలో ఉన్నారు. పవన్ కల్యాణ్, సోము వీర్రాజులు వచ్చే ఎన్నికల్లో కాపు సామాజికవర్గం ఓటర్లపైనే ఎక్కువగా నమ్మకం పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ముద్రగడ పద్మనాభంను పార్టీలోకి తీసుకురావాలని ఆ జిల్లాకు చెందిన నేతలకు జగన్ చెప్పినట్లు తెలుస్తోంది. ముద్రగడ పద్మనాభం పార్టీలో చేరితే ఆయనకు సముచిత గౌరవం ఇస్తామని, అంతేకాకుండా రాజ్యసభ పదవి కూడా ఇస్తామని జగన్ చెప్పినట్లు తెలిసింది. ముద్రగడ పద్మనాభంను తమ పార్టీలో చేరాల్సిందిగా ఇప్పటికే బీజేపీ ప్రయత్నించింది. సోము వీర్రాజు స్వయంగా వెళ్లి కలిసినా ఆయన సున్నితంగా తిరస్కరించారు. ముద్రగడ పద్మనాభంకు జగన్ అంటే కొంత సానుకూలత ఉందంటున్నారు. అందుకే జగన్ ప్రపోజల్ కు ఆయన అంగీకరించే అవకాశాలున్నాయి. జగన్ ఈ ఐడియా వర్క్ అవుట్ అయితే కాపు సామాజికవర్గంలో బీజేపీ, జనసేనకు కొంత గండిపడే అవకాశముంది. ఆలీ కథ ట్రాజెడీయేనాహాస్య నటుడు అలీకి జగన్ హామీ ఇచ్చిన తీపి కబురు అందడం లేదా? ఆశించినట్లుగా రాజ్యసభకు అలీకి అవకాశం ఇవ్వడం లేదా? జరుగుతున్న పరిణామాలను గమనిస్తే అలీకి జగన్ హ్యాండిచ్చారనే అర్థమౌతుంది. ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలకు జరగనున్నాయి. సంఖ్యా బలాన్ని బట్టి ఆ నాలుగూ కూడా వైసీపీ ఖాతాలోనే పడతాయి. జగన్ అలీని రాజ్యసభకు పంపుతారని హామీ ఇచ్చారనీ, అందుకే సినీ పరిశ్రమలో తనకు అత్యంత సన్నిహితుడైన పవన్ కల్యాణ్ ను కూడా కాదని అలీ వైసీపీ తీర్థం పుచ్చుకున్నారనీ ఒక ప్రచారం ఉంది. అంతే కాకుండా జగన్ ఇటీవల స్వయంగా అలీని తిరుపతికి పిలిపించుకుని మరీ త్వరలో శుభ వార్త వింటారని చెప్పారనీ కూడా అంటున్నారు. ఆ శుభ వార్త రాజ్యసభ టిక్కెట్టేనని అలీతో సహా అంతా భావించారు. మరి అంతలోనే ఏమైందో రాజ్యసభ టికెట్ల అభ్యర్థుల ఎంపికలో అలీ పేరు కనీసం పరిశీలనకు కూడా రాలేదంటున్నారు. ఇక ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డికి రెన్యువల్ చేసే పరిస్థితే లేదని పార్టీ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. దీంతో రాజ్యసభకు జగన్ ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. జగన్ కేసులు వాదించే న్యాయవాది నిరంజన్ రెడ్డిని రాజ్యసభకు పంపించే యోచనలో జగన్ ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అంటే మరో రెండు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఆ రెండు స్థానాలలో ఒకటి ఎస్సీలకు కేటాయించాలని జగన్ భావిస్తున్నారు. ఆ కోటాలో డొక్కా మాణిక్యవరప్రసాద్, బీరం మస్తానరావుల పేర్లు పరిశీలనలో ఉన్నాయంటున్నారు. మరో స్థానాన్ని కమ్మ సామాజిక వర్గానికి కేటాయించి, విస్తరణలో ఆ వర్గానికి మొండి చేయి చూపి ఎదుర్కొన్న విమర్శల నుంచి బయటపడాలని జగన్ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో జగన్ నటుడు అలీ రాజ్యసభ ఆశలు గల్లంతైనట్లేనని అంటున్నారు. జగన్ ను నమ్ముకుని పార్టీలో చేరిన అలీకి ఇది రెండో ఆశాభంగంగా చెప్పుకోవచ్చు. మొదటిది 2019 ఎన్నికలలో అలీకి రాజమండ్రి, మంగళగిరిలలో ఏదో స్థానం నుంచి అసెంబ్లీకి పోటీ చేసే అవకాశం ఇస్తానని జగన్ హామీ ఇచ్చారని చెబుతున్నారు. ఆ ఆహామీ కారణంగానే అప్పట్లో జనసేనలో చేరుదామని భావించిన అలీ మనసు మార్చుకుని వైసీపీ తీర్థం పుచ్చుకున్నారంటారు. అలీ, పవన్ కల్యాణ్ మంచి స్నేహితులన్న విషయం సినీ పరిశ్రమ మొత్తానికి తెలుసు. అలాంటిది అలీ వైసీపీ తీర్థం పుచ్చుకోవడంతో ఇరువురి మధ్యా స్నేహం కూడా చెడింది. పవన్ కల్యాణ్ అలీ వైసీపీలో చేరడాన్ని ప్రస్తావిస్తూ, సాయం పొందిన వ్యక్తులు కూడా ఇలా చేస్తారంటూ వ్యాఖ్యానించారు. అందుకు ప్రతిగా అలీ కూడా ఏం సాయం చేశారు పవన్ కల్యాణ్ గారూ, ఎవరికైనా చెప్పి సినిమా అవకాశాలు ఇప్పించారా? డబ్బు సాయం ఏమైనా చేశారా అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించిన విషయం కూడా తెలిసిందే. అప్పట్లో అసెంబ్లీ సీటు విషయంలో మాటతప్పిన జగన్ ఇప్పుడు రాజ్యసభ టికెట్ విషయంలో మడమ తిప్పడంతో జగన్ ను నమ్ముకున్న అలీకి రెండు సార్లూ నిరాశ ఎదురైనట్లయ్యింది. రాజ్యసభ రేసులో ఎంటరౌతూనే ఔటైపోయిన అలీ ఎలా స్పందిస్తారన్నది చూడాలి.

## ఇక యాక్టివ్ గా అదితి..

విజయనగరం, మే 5,. ఇన్నాళ్లూ రాజకీయాలు ఇంట్రెస్ట్ లేదన్నారు. కనీసం కార్యకర్తలనూ కలవలేదు. హైదరాబాద్‌లో సెటిలైపోదామని ఫిక్సైపోయారు. అధినేతకూ అదే చెప్పారు. కానీ, ఇప్పుడు సడన్‌గా యాక్టీవ్ అయ్యారు. రాజుగారమ్మాయిలో ఎందుకీ మార్పు? విజయనగరంలో ఆమె వ్యవహారశైలి దేనికి సంకేతం? విజయనగరం జిల్లాలో టీడీపీని తన కనుసన్నల్లో నడుపుతున్న సీనియర్ నేత అశోక్ గజపతిరాజుకు.. రాజకీయంగా బలమైన ట్రాక్ రికార్డ్ ఉంది. ఏడు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచిన ఆయన రాష్ట్ర, కేంద్ర మంత్రివర్గాల్లో పనిచేశారు. 2014 ఎన్నికల్లో విజయనగరం ఎంపీగా గెలిచి కేంద్ర విమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అదే ఎన్నికల్లో ఆయన రెగ్యులర్ స్థానమైన విజయనగరం అసెంబ్లీ సెగ్మెంట్‌లో మీసాల గీత ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే, 2019 ఎన్నికల్లో మీసాల గీత స్థానంలో అశోక్ వారసురాలు అదితి గజపతికి టీడీపీ అవకాశం ఇచ్చింది. అశోక్‌ను మళ్లీ విజయనగరం ఎంపీగా నిలబెట్టింది. అయితే, ఫలితం నిరాశపరిచింది. వైసీపీ వేవ్‌లో ఎంపీగా అశోక్ గెలవలేదు. ఎమ్మెల్యేగా ఆయన కూతురూ విజయం సాధించలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అశోక్ గజపతిని సమస్యలు చుట్టుముట్టాయి. మాన్సాస్ వివాదం తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. కోర్టు తీర్పు తర్వాత మళ్లీ మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ పీఠాన్ని చేజిక్కించుకున్నా అధికార పార్టీ తీరుతో సతమతమయ్యారు. వయోభారం కారణంగా ప్రతిపక్ష పాత్రను కూడా యాక్టీవ్‌గా పోషించలేకపోతున్నారు. ఆయన కుమార్తె అదితి గజపతి కూడా కొన్నాళు పార్టీలో యాక్టివ్‌గానే ఉన్నా ఆర్నెళ్లుగా దూరంగా ఉంటున్నారు. కార్యకర్తల్ని కలవట్లేదు. ఫోన్ చేస్తే ఎత్తడం లేదు. ఎన్ని మెసేజ్‌లు పెట్టినా స్పందించడం లేదు. తాను, రాజకీయాలు పట్టించుకోవడం లేదని, ఏదైనా ఉంటే తన తండ్రి అశోక్ గజపతితో మాట్లాడాలని చెప్పేశారని టాక్. నియోజకవర్గ ఇన్చార్జ్‌గా ఉన్న అదితి వ్యవహారం కార్యకర్తలను అయోమయంలో పడేసింది. రాష్ట్రమంతా టీడీపీ కమిటీలు వేస్తే ఈ నియోజకవర్గంలో మాత్రం ఆ ఊసేలేదు. ఓ వైపు అధికార పార్టీ ఎమ్మెల్యే కోలగట్ల ప్రజల్లోకి దూసుకుపోతుంటే టీడీపీలో మాత్రం నిస్తేజం కనిపిస్తోంది. విషయం తెలుసుకున్న చంద్రబాబు నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌లో లోకల్ నేతలంతా హాజరైనా అశోక్ గజపతి, అదితి గజపతిలతో చంద్రబాబు వ్యక్తిగతంగా సమావేశమయ్యారు. తనకు రాజకీయాలు ఆసక్తి లేదని, హైదరాబాద్‌లో సెటిలవ్వాలనుకుంటున్నట్టు ఈ సందర్భంగా చంద్రబాబుకు అదితి చెప్పినట్టు సమాచారం. అయితే, ఒక్కసారిగా షాకైన చంద్రబాబు మరోసారి ఆలోచించుకోవాలని సూచించారట. కుటుంబ చరిత్రను, కీర్తిని ముందుకు తీసుకుకెళ్లాల్సిన బాధ్యతను గుర్తు చేశారట. అందుకోసమైనా రాజకీయాల్లో ఉండాలని అదితికి నచ్చజెప్పారని సమాచారం. నియోజకవర్గ కమిటీలు వేసి ఆర్నెళ్లలో పార్టీని బలోపేతం చేయాలని అదితిని చంద్రబాబు ఆదేశించారని తెలుస్తోంది. అశోక్ ఆరోగ్య పరిస్థితి కూడా బాగాలేదు కాబట్టి.. కొన్నాళ్లు ఆయనకు అండగా ఉండి క్యాడర్‌ను ముందుకు తీసుకెళ్లాలని హితబోధ చేశారట. ఆ తర్వాత కూడా నిర్ణయంలో మార్పు లేకుంటే అప్పుడు ఆలోచిద్దామన్నారట చంద్రబాబు. మీటింగ్ తర్వాత విజయనగరం చేరుకున్న అదితి.. పార్టీలో యాక్టీవ్ అయ్యారు. ఇన్నాళ్లూ సైలెంట్‌గా ఉన్న అదితి గజపతి? సడన్ గా యాక్టీవ్ కావడం పార్టీ శ్రేణుల్ని ఆనందపరుస్తోంది. ఆశ్చర్యపరుస్తోంది. కాకపోతే, ఈ యాక్టివ్‌నెస్‌ని కంటిన్యూ చేస్తారా? లేక మరో ఆర్నెళ్లు కాగానే ఇంట్రెస్ట్ లేదంటూ తప్పుకుంటారా? అనే అనుమానమూ వెంటాడుతోంది.

## టార్గెట్ 2024 అడుగులు

విజయవాడ, మే 5, ఏపీలో అప్పుడే ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రధాన పార్టీలన్నీ 2024 ఎన్నికలే టార్గెట్‌గా వ్యూహాలు రచిస్తున్నాయి. ఇవాళ చంద్రబాబు జిల్లాల టూర్ ప్రారంభం కానుంది. దీంతో టార్గెట్ 2024 దిశగా చంద్రబాబు తొలి అడుగు వేస్తున్నారా అనే చర్చ జరుగుతోంది. కాగా, ఇప్పటికే అధికార వైసీపీ ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తూ, ఎన్నికలకు రెడీ అవుతోంది. వైసీపీ నేతలకు సీఎం జగన్ పలు ఆదేశాలు కూడా జారీ చేశారు. నేతలకు ఆదరణ ఉంటేనే టికెట్ అంటూ స్పష్టమైన సంకేతాలు కూడా ఇచ్చారు. దీంతో గడపగడపకు వైసీపీ అనే కార్యక్రమం చేపడుతున్నారు నేతలు. ఇక పవన్ కళ్యాణ్ కూడా ఎలక్షన్ కోసం గట్టిగానే ప్రిపేర్ అవుతున్నారు. ఇప్పటికే రైతు భరోసా పేరుతో ప్రజలకు చేరువ అవుతున్నారు. ఈ పార్టీల కార్యక్రమాలతో అలెర్ట్ అయ్యింది తెలుగుదేశం పార్టీ. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా ఏపీలో పొలిటికల్ హీట్ పెంచుతున్నారు. ఇతర పార్టీ అధినేతల కంటే ముందుగానే జనం బాట పడుతున్నారు చంద్రబాబు. అయితే, ఇంత సడెన్‌గా బాబు జిల్లాల టూర్ చేపట్టడానికి కారణం ఏంటనే చర్చ జరుగుతోంది. ఇవాళ్టి నుంచి చంద్రబాబు జిల్లాల టూర్ ప్రారంభం అవుతోంది. తనకు బాగా సెంటిమెంట్ అయిన సిక్కోలు నుంచే ఆయన తన పర్యటనను ప్రారంభించడం విశేషం. మొన్ననే చంద్రబాబు జిల్లాల పర్యటనల షెడ్యూల్‌ను విడుదల చేసింది టీడీపీ. ఇటీవల తెలుగుదేశం నిర్వహిస్తున్న బాదుడే బాదుడు నిరసనల్లో భాగంగా, మొదట శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నియోజకవర్గం దల్లావలస గ్రామంలో చేపట్టే కార్యక్రమంలో పాల్గొననున్నారు చంద్రబాబు. భీమిలి నియోజవర్గం తాళ్లవలసలో రేపు, ముమ్మడివరం నియోజవర్గం కోరింగ గ్రామంలో ఎల్లుండి బాదుడే బాదుడు కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారు. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమలో బాబు పర్యటనలు ఉండేలా ప్రణాళిక సిద్దం చేసింది టీడీపీ. మహానాడు వరకు జిల్లాల్లోనే పర్యటించనున్నారు చంద్రబాబు. అటు సొంత నియోజకవర్గమైన కుప్పంపైనా చంద్రబాబు స్పెషల్ ఫోకస్ పెట్టినట్టు ఛెబుతున్నారు...

## విగ్రహ పుష్టి.. నైవేద్య నష్టి

ఏలూరు, మే 5, రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచుల పరిస్థితి దారుణంగా తయారైంది. నూతన సర్పంచ్‌లు కేవలం పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి కూర్చొని వచ్చేందుకు మాత్రమే పరిమితమయ్యారు. గత ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. అనంతరం కౌంటింగ్ జరగ్గా ఆ రోజునే రిటర్నింగ్ అధికారుల వద్ద గెలుపొందినట్లుగా ధ్రువీకరణ పత్రాలను అందుకున్న నూతన సర్పంచ్‌లు బాధ్యతల కోసం నెలన్నర ఎదురుచూశారు. అయితే ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు ఎట్టకేలకుపంచాయతీల్లో ప్రత్యేక సమావేశాలను నిర్వహించి సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీ సర్పంచ్‌లకు గ్రామంలో ఏ పనిచేయాలన్న సర్వాధికారాలు ఉంటాయి. అయితే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చాలా జిల్లాల్లో.. భిన్నమైన పరిస్థితి ఉంది. అట్టహాసంగా ఏడాది క్రితం బాధ్యతలు స్వీకరించారే తప్ప ప్రభుత్వం నుంచి ఇంత వరకూ చెక్‌పవర్ రాలేదు. ఈ చెక్‌పవర్ లేకపోవడంతో నూతన సర్పంచ్‌లు ఆయా గ్రామ పంచాయతీల్లో ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వేసవి ప్రారంభం కావడంతో తాగునీటి సమస్యతో పాటు, ఇతర ముఖ్యమైన పనులు చేపట్టేందుకు కూడా సర్పంచ్‌లకు అవకాశం లేకపోవడంతో వారు ఏమీ చేయలేకపోతున్నారు. ఇదిలా ఉంటే గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై కూడా సర్పంచ్‌లకు అజమాయిషీ లేకుండా చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సర్పంచ్‌ల అధికారాలకు మరింత కత్తెర పడినట్లయ్యింది. దీంతో వీళ్లంగా కూడా గుర్రుగా ఉన్నారు. ఇదిలా ఉంటే గెలిచినోళ్లంతా సర్పంచ్‌లుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రోజువారీ పంచాయతీ కార్యాలయాలకు వచ్చి సీట్లో కూర్చొని తిరిగి వెళ్లిపోవడమే జరుగుతోందని రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా కొత్తగా ఏ పనులు చేపట్టాలన్నా చెక్‌పవర్ అవసరం ఉందని, అయితే ఆ అధికారాన్ని ప్రభుత్వం ఇంతవరకూ ఇవ్వకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని సర్పంచ్ లు అంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచ్‌లో ( 90 శాతం సర్పంచ్‌లు వైసీపీ వాళ్లే) ప్రభుత్వంపై, ఇటు ముఖ్యమంత్రిపై తీవ్రమైన అసంతృప్తి ఏర్పడుతోంది.

## విశాఖలో భారీగా మిరియాల పంటలు

విశాఖపట్టణం, మే 5,మిరియాల సాగుకు కేరళ పెట్టింది పేరు. ఇప్పుడు విశాఖ మన్యంలోనూ మిరియాలు సాగవుతున్నాయి. దిగుబడిలోనే కాకుండా నాణ్యతలోనూ మన్యం మిరియం కేరళకు గట్టి పోటీ ఇస్తోంది. కేరళలో పండే మిరియాల కంటే నాణ్యమైన ఆర్గానిక్ మిరియాలను విశాఖ మన్యం అందిస్తోంది. ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండానే.. ఇంకా చెప్పాలంటే పైసా పెట్టుబడి లేకుండానే గిరిజన రైతులు వీటిని పండిస్తున్నారు. ఈ ఏడాది ఒక్క మిరియాల పంట ద్వారానే మన్యం రైతులు రూ.150 కోట్ల వరకూ ఆదాయాన్ని ఆర్జించారంటే విశేషమే మరి. విశాఖ మన్యంలో కాఫీ తోటల్లో అంతర పంటగా మిరియాల సాగు జరుగుతోంది. కాఫీ తోటల ద్వారా కాపును బట్టి ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకూ ఆదాయం వస్తుంటే.. అందులో అంతర పంటగా వేస్తున్న మిరియాలతో రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకూ అదనపు ఆదాయం సమకూరుతోంది. మిరియాల సాగుకు సూర్యరశ్మితో పాటు తగిన నీడ కూడా ఉండాలి. నీరు నిలవని ఏటవాలు భూమి అవసరం. పాదులు 20 నుంచి 30 అడుగుల ఎత్తుకు పెరుగుతాయి కాబట్టి వాటికి ఆసరాగా ఎత్తయిన చెట్లు ఉండాలి. విశాఖ మన్యంలోని కొండవాలు ప్రాంతాలు సాగుకు అనుకూలంగా ఉండటంతో ప్రస్తుతం 98 వేల ఎకరాల కాఫీ తోటల్లో రైతులు అంతర పంటగా మిరియాల పాదులు వేశారు. ఒకసారి మొక్క వేస్తే రెండో ఏట నుంచే కాపు మొదలవుతుంది. 20 సంవత్సరాల పాటు జనవరి నుంచి ఏప్రిల్?మే నెల వరకూ ఫలసాయం వస్తుంది. ఈ ప్రాంతంలో కాఫీ మొక్కలకు నీడ కోసం పొడవుగా ఎదిగే సిల్వర్ ఓక్ చెట్లను పెంచుతున్నారు. ఆ చెట్ల మొదలులో మిరియం మొక్కలు నాటుతున్నారు. పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ద్వారా గిరిజన రైతులను మిరియాల సాగు వైపు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం కరియా ముండ, పన్నియూరు?1 అనే రకాల మిరియాలు సాగవుతున్నాయి. వాటికన్నా అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తిని ఇచ్చే మేలు రకాల మొక్కల (మదర్ ప్లాంట్ల)ను కోజికోడ్‌లోని భారత సుగంధ ద్రవ్యాల పరిశోధన సంస్థ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైసెస్ రీసెర్చ్?ఐఐఎస్ఆర్) నుంచి తీసుకొచ్చి చింతపల్లిలో నర్సరీల్లో అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో శక్తి, మలబార్ ఎక్సెల్, పౌర్ణమి, గిరిముండ, పంచమి, శుభకర, శ్రీకర రకాల మొక్కలు ఉన్నాయి. వాతావరణం అనుకూలించడంతో ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో దాదాపు 4 వేల మెట్రిక్ టన్నుల మిరియాల దిగుబడి వచి?చంది. 3.2 కిలోల పచ్చి మిరియాలను ఎండబెడితే ఒక కిలో ఎండు మిరియాలు వస్తాయి. వాటి ధర కిలో రూ.360 నుంచి రూ.400 వరకూ ఉంది.

## పనస కాయలకు మంచి డిమాండ్



శ్రీకాకుళం, మే 5, ఉద్దానం పంటను ఉత్తరాది వాళ్లూ మెచ్చారు. ఇక్కడి పనసకు కాయలను ఆ రాష్ట్రాల వారు లొట్టలేసుకుని తింటున్నారు. దీంతో ఇక్కడి పనస డిమాండ్ పెరుగుతోంది. రుచి పరంగా అద్భుతంగా ఉండడంతో పాటు రంజాన్ సీజన్ కావడంతో ఉత్తరప్రదేశ్, బిహార్, తదితర రాష్ట్రాలు ఉద్దానం ప్రాంతం నుంచి పనస కాయలు, పండ్లను దిగమతి చేసుకుంటున్నాయి.మరోవైపు కాశీబుగ్గ కేంద్రంగా బరంపురం, గుజరాత్, కోల్‌కతా, కటక్ తదితర ప్రాంతాలకు కూడా పనస ఎగుమతి అవుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ, పూండి, హరిపురం, కవిటి, ఇచ్ఛాపురం, మందస, కంచిలి, సోంపేట కేంద్రాల నుంచి వివిధ రాష్ట్రాలకు పనస ఎగుమతులు ఊపందుకున్నాయి. గడచిన రెండు నెలల్లో రోజుకు సగటున 44 టన్నుల చొప్పున ఇప్పటివరకు 2,640 టన్నుల పనస కాయలు ఎగుమతి అయ్యాయి.మార్చి నెలాఖరు నుంచి మే వరకు పనస ఎగుమతులు కొనసాగుతాయి. తిత్లీ తుపానుకు దెబ్బతిన్న పనస చెట్లన్నీ ఈ ఏడాది జీవం పోసుకుని విరగకాస్తున్నాయి. ఉద్దాన ప్రాంతంలోని ఏడు మండలాల్లో పనస అంతర పంటగా సాగవుతోంది. ఇబ్బడిముబ్బడిగా దిగుబడులు రావడంతో ప్రస్తుతం కేజీ పనస కాయ కేవలం రూ.13 చొప్పున మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధర గతంలో కేజీ రూ.20 వరకు ఉండేది. ఉద్యాన శాఖాధికారులు పనస, మునగ తదితర పంటలకూ ప్రభుత్వ పరంగా ధరలు నిర్ణయిస్తే మేలు జరుగుతుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.ముక్కల బిర్యానీ, పనస పొట్టు కూర, పనస పండు హల్వా, పనస పొట్టు పకోడి, పనస గింజల కూర, పనస ముక్కల గూనచారు, పనస చిల్లీ, పనస కాయ కుర్మా, పనసకాయ ఇడ్లీ, పొంగనాలు, పనస నిల్వ పచ్చడి, పనస బూరెలు.

## చింత... కాసులు..



శ్రీకాకుళం, మే 5,: చింతపండు గిరిజనుల ఇంట సిరులు కురిపిస్తోంది. ఈ ఏడాది మంచి ధర లభించింది. ప్రైవేట్ వ్యాపారులు, జీసీసీ సిబ్బంది పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని పాడేరు డివిజన్‌లో 11 మండలాలు, రంపచోడవరం డివిజన్ పరిధిలో మారెడుమిల్లి ప్రాంతంలో వ్యాపారం జోరుగా సాగుతోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో చింతపండు దిగుబడి ఆశాజనకంగా ఉంది. గిరిజన ప్రాంతాల్లోని చింతపండుకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది.జీసీసీ సిబ్బంది, ప్రైవేట్ వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి చివరిదశకు చేరుకోవడంతో కొనుగోలులో పోటీ నెలకొంది. గిరిజన సహకార సంస్థ ఈ ఏడాది కిలో రూ.32.40 మద్దతు ధరతో భారీగా కొనుగోలు చేస్తోంది. గత ఏడాది చింతపల్లి, పాడేరు డివిజన్ల పరిధిలో సుమారు 120 టన్నుల వరకు జీసీసీ కొనుగోలు చేసింది. మార్చి నెల సీజన్ ప్రారంభంలో కిలో రూ.25 నుంచి రూ.30 వరకు వ్యాపారులు కొనుగోలు చేయగా, జీసీసీ రూ.32.40కు కొనుగోలు చేసింది. మార్కెట్‌లో పోటీగా ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు కూడా ధరను పెంచారు. ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులు చింతపండు నాణ్యతను బట్టి కిలో రూ.35 నుంచి రూ.40 వరకు కొనుగోలు చేస్తున్నారు.అయితే తూకంలో మాత్రం తేడాలు ఉండడంతో మోసపోతున్నామని గిరిజన రైతులు వాపోతున్నారు.పలువురు గిరిజనులు తాము సేకరించిన చింతపండును సంతల్లో విక్రయిస్తున్నారు. దేవరాపల్లి, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు సంతల్లో చింతపండును భారీగా విక్రయించారు. ప్రైవేటు వ్యాపారులు,స్థానిక ప్రజలు 15 కిలోల బరువు తూగే చింతపండు బుట్టను రూ.500 నుంచి రూ.500 వరకు కొనుగోలు చేశారు.

## కుటుంబం ఆత్మహత్యాయత్నం

శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. జలుమూరు మండలం యలమంచిలి గ్రామంలో చిన్నమ్మడు, నరసింహులు దంపతులు నివసిస్తున్నారు. వీరికి రంజిని, జాహ్నవి, శశాంకర్ సంతానం. అయితే.. ఏ కష్టం వచ్చిందో తెలీదు గానీ చిన్నమ్మడు తన ముగ్గురు పిల్లతో కలిసి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. పక్క గదిలో ఉన్న నరసింహులు, స్థానికులు గమనించి మంటలను ఆర్పి శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే.. చిన్నమ్మడు, జాహ్నవి మృతి చెందగా.. రంజని, శశాంకర్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. చిన్నమ్మడు భర్త నరసింహులును విచారిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు

బేతంచెర్ల ఉత్తేజిత ప్రతినిధి : పట్టణ పరిధిలో నంద్యాల రోడ్డులోగల ధ్యానమంధిరం ఎదురుగా ఉన్న కాశినాయన ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న నూకతాటి బాలకృష్ణ (51) గత కొంతకాలంగా టిబి వ్యాధితో బాధపడుతూ గురువారం మృతి చెందాడు.మృతునికి సమీప బంధువులు లేనందున, ఆశ్రమ నిర్వాహాకులు బాలమద్దయ్య,మృతుడికి అంత్యక్రియలు నిర్వహించమని,ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వన్నూరు భాషా కు తెలియజేశారు.వన్నూరు బాషా బేతంచెర్ల సిఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్సై శ్రీనివాసులుకి సమాచారం ఇచ్చి,బేతంచెర్ల సర్వజన స్మశానవాటికలో మృతుడికి అంత్యక్రియలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, నాగేశ్వరరెడ్డి,రాఘవేంద్ర, సద్దాం, యూసుఫ్, పుల్లంరాజు, అక్బర్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయం వాలంటీర్లకు ఉగాది పురస్కారాలు హర్షణీయం

**- నగర మేయర్ స్రవంతి జయవర్ధన్**

నెల్లూరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న సచివాలయ వాలంటీర్లకు ఉగాది పురస్కారాలు అందజేయడం హర్షణీయమని నెల్లూరు నగర మేయర్ పోట్లూరి స్రవంతి జయవర్ధన్ పేర్కొన్నారు. నెల్లూరు గ్రామీణ నియోజవర్గ వర్గం పరిధిలోని స్థానిక వావిలేటిపాడు గ్రామంలో గురువారం సచివాలయం వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూసంక్షేమ పాలన కోసం ముఖ్యమంత్రి ఆలోచనలతో రూపొందించిన సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పతకాలను అందించడంలో వారధులుగా నిలుస్తున్న వాలంటీర్ల సేవలు ఎంతో అభినందనీయమన్నారు.తమ సచివాలయ పరిధిలోని ప్రజలందరితో మమేకమై అనునిత్యం వారి సమస్యలను ప్రభుత్య దృష్టికి తీసుకోచ్చేలా వాలంటీర్లు కృషి స్థానిక 12వ డివిజన్ లోని వావిలేటిపాడు పరిధిలో విధులు నిర్వహిస్తున వాలంటీర్లకు ఉగాది ప్రోత్సాహక పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ అతిపాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాది పురస్కారాలకు ఎంపికైన గ్రామ, వార్డు వాలంటీర్లు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేశంలో కాని, ప్రపంచంలో కాని ఎక్కడా లేని విధంగా పరిపాలనలో స్వర్ణయుగం తెచ్చేలా 2019 ఆగస్టు 15న వాలంటీర్లను సచివాలయ వ్యవస్థలో భాగంగా చేసారని తెలిపారు. మృత్యువుతో ప్రపంచ వ్యాప్తంగా భీభత్సానికి గురిచేసిన కరోనా సమయంలో సైతం ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు కావలసిన సేవలు, అందాల్సిన సంక్షేమ పథకాలను ధైర్యంగా ప్రజలకు వాలంటీర్లు అందజేశారని కొనియాడారు. వాలంటీర్ల విశిష్ట సేవలను మెచ్చిన గౌరవ ముఖ్యమంత్రి వర్యులు సేవా మిత్రా, సేవ రత్న, సేవా వజ్ర పేర్లతో ఉగాది పుర్కారాలను ప్రత్యేకంగా నిర్వహించడం శుభ పరిణామం అని వారు ప్రశంసించారు. అవార్డులు అందుకున్న వాళ్లకి, అందుకోని వాళ్ళకి కొద్దిపాటి తేడా మాత్రమే ఉన్నదని, అవార్డులు రానివాళ్లు మరింత కృషి చేసి రాబోయే సంవత్సరంలో పురస్కారపు గౌరవాన్ని అందుకోవాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో 12వ డివిజన్ వై.సీ.పీ ఇంచార్జ్ జయవర్ధన్ మరియు ఇతర వై.సీ.పీ నాయకులు పాల్గొన్నారు.

# అధికారులు విచారించి న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం

**-బాధితురాలు తులసి రామ కుమారి**

నెల్లూరు బుచ్చి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు కౌన్సిలర్ చీర్ల ప్రసాద్ అతని అనుచరుల ఆగడాలు రోజురోజుకీ మితిమీరి పోతున్నాయని ఈ విషయమై అధికారులు స్పందించి విచారణ చేపట్టి తమ కుటుంబానికి న్యాయం చేయకపోతే తమ కుటుంబ సమేతంగా ఆత్మహత్యలు చేసుకోవాల్సి ఉంటుందని బాధితురాలు బుచ్చిరెడ్డిపాలెం రామకృష్ణ నగర్ కు చెందిన తులసి రామ కుమారి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కుటుంబ ఆర్థిక స్థితిగతుల కారణంగా బుచ్చిరెడ్డిపాలెం వాస్తవ్యులైన కొంతమంది దగ్గర అప్పు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ క్రమంలో తన కామ వాంఛ తీర్చుకోవాలనే కుట్రతో బుచ్చిరెడ్డిపాలెం 14వ వార్డ్ కౌన్సిలర్ చీర్ల ప్రసాద్ తాము బాకీ పడివున్న వాళ్ళందరిని రెచ్చగొట్టి మా ఇంటికి పంపి బాకీ వసూలు చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్న ట్లు ఆరోపించారు. ఇదంతా పేర్ల ప్రసాద్ ఎందుకు చేస్తున్నాడు అనే విషయాన్ని అతన్ని అడుగుగా నీవు నాతో సఖ్యతగా ఉంటే నీవు ఇవ్వాల్సిన బాకీ నేనే తీరుస్తాను అని తన వక్ర బుద్ధిని బయటపెట్టాడని పేర్కొన్నారు. చీర్ల ప్రసాద్ అంతటితో ఆగకుండా వాట్సాప్ కాల్ చేసి నువ్వు నా దగ్గరికి వస్తే తప్ప నీకు వేరే దారి లేదని, మీ కుటుంబ పరువు ప్రతిష్టలు బజార్ కాల్ చేస్తానని ఫోన్ ద్వారా బెదిరిస్తున్నారని చెప్పారు. ఈ విషయమై ఏప్రిల్ 6న జిల్లా ఎస్పీ సిహెచ్ విజయరావుకి ఫోన్ ద్వారా మా పరిస్థితి వివరించామనన్నారు. ఎస్పీ ఆదేశాలతో స్పందించిన బుచ్చిరెడ్డిపాలెం సి ఐ మమ్మల్ని పిలిపించి విచారణ జరుపగా సమస్య కొంత కాలం సద్దుమణిగిందన్నారు.ఇదిలా ఉండగా బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ చైర్ పర్సన్ భర్త మోర్ల మురళితో కుమ్మక్కైన కౌన్సిలర్ చీరల ప్రసాద్ తనకు రావలసిన డబ్బులు కూడా రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై వెలుగు గ్రూప్ అధికారులను సంప్రదించగా కౌన్సిలర్ చీర్ల ప్రసాద్ ను మరియు మోర్ల మురళీలను కలిసి మాట్లాడితే మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది అని సలహా ఇచ్చారని తెలిపారు . ఈ విధంగా వేధింపులు, బెదిరింపులు పడలేక మానసిక ఒత్తిడితో ఏప్రిల్ 11న ఆత్మహత్య ప్రయత్నం చేసుకుని ఆస్పత్రి పాలు కావాల్సి వచ్చిందని బాధ పడ్డారు . ఇదే క్రమంలో బుధవారం రాత్రి 1:40 సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తమ ఇంటి పై రాళ్ల వర్షం కురిపించారని తెలిపారు. ఆ సమయంలో 100 ఫోన్ చేయగా మూడు గంటలకు పోలీసు వారు వచ్చి విచారించి వెళ్లారని తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు వస్తున్న విషయం తెలుసుకుని గుర్తు తెలియని ఆగంతకులు పలాయనం చిత్తగించారని తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచారణ చేపట్టి తగు న్యాయం చేయకపోతే తమ కుటుంబ సభ్యులందరం మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యమని వేడుకున్నారు. ఈ సమావేశంలో బాధితురాలు తులసి రామ్ కుమారి, బాధితురాలి భర్త తులసి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల ఋణాలను మాఫీ చేయాలి

**సీపీఐ, ఏపి రైతు సంఘం**

బేతంచెర్ల ఖరీఫ్ సీజన్ను దృష్టిలో ఉంచుకొని రైతులకు పంట రుణాలు రెన్యువల్ మరియు కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల సహాయ కార్యదర్శి యన్నా భార్గవ్,ఏపీ రైతు సంఘం నాయకులు దస్తగిరి ఆధ్వర్యంలో పట్టణంలోని స్టేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ లలో మేనేజర్లను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందని రైతులు వ్యవసాయ పనులు ఇప్పటి నుంచే ప్రారంభించారని,గత సంవత్సరం కరువు అధిక వర్షాల వల్ల పంట సరిగా పండక రైతులు తీవ్రంగా నష్టపోయారని చివరికి వ్యవసాయాన్ని మానేసే నిర్ణయానికి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు,కానీ ఆశ చంపుకోలేక వ్యవసాయానికి సిద్ధపడుతున్నారని,గత సంవత్సరం తీసుకున్న అప్పు చెల్లించాలని లేని యెడల అప్పు ఇచ్చేది లేదని బ్యాంక్ మేనేజర్లు రైతులను ఇబ్బందుకు గురిచేస్తున్నారని,రైతులను ఇలా భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదన్నారు.వెంటనే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటల వారీగా రుణాలను పెంచి, గుర్తింపు పొందిన రైతులు, కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల కార్యదర్శి తిరుమలేష్,రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యన్న ఉదయ్, ఏఐవైఎఫ్ నాయకులు ఎల్ల కృష్ణ, మనోహర్,తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా చెరువు తవ్వకాలు నిలిపివేయాలి....

**చెరువు తవ్వకాల వద్ద గ్రామస్తులు ఆందోళన .. సంఘటనా స్థలానికి చేరుకున్న రెవెన్యూ అధికారులు...**

కోనసీమ అక్కడ చెరువు తవ్వకాలను నిలిపివేయాలని రాయవరం మండలం సోమేశ్వరం గ్రామ శివారులో సీతంపేట వద్ద బుధవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ సోమేశ్వరం గ్రామపంచాయతీ సీతంపేట గ్రామం లో ఉన్న పంట పొలాల్లో చేపలు రొయ్యల చెరువులు తవ్వి వాటిని పెంచడానికి నిర్వాహకులు నిర్ణయించుకున్నారు. అయితే చేపలు లు చడం వల్ల వాటి కోసం వాడే రసాయనాలు ఎరువులు వ్యర్థాల వల్ల వచ్చే దుర్వాసన వల్ల మాత్రమే కాకుండా తాగునీరు కలుషితమై తద్వారా సీతంపేట గ్రామ ప్రజలు పిల్లలు, పెద్దలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, పాడి పంట పొలాలు కూడా పాడవే పరిస్థితి కూడా ఉందని గ్రామ ప్రజలు ఆవేదన చెందారు. సీతంపేట లో ఉన్న కోళ్ల ఫారం ద్వారా వచ్చే దుర్వాసన, వ్యర్థాలు, ఈగల ద్వారా ఇళ్లల్లోకి చేరి గాలి, ఆహారం, త్రాగు నీరు కలుషితం అవుతుంది. అంతే కాకుండా గ్రామంలో వున్న ఇటుక బట్టీలు ద్వారా వచ్చే బూడిద వలన గాలి, ఆహారం, త్రాగు నీరు కలుషితం అవుతుందని గ్రామస్తులు తమ ఆవేదనను తెలియజేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని చెరువు తవ్వకాల నిర్వాహకులకు ఆదేశించారు. ఈ విషయంపై తాసిల్దార్ జే ప్రకాష్ బాబు ను వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే సోమేశ్వరం గ్రామ రెవెన్యూ అధికారి కి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ లకు సమస్య ఆందోళన కారణంగా లేకుండా సానుకూలంగా పరిష్కరించాలని తాసిల్దార్ అన్నారు. ఇప్పటికే తవ్వకాలను నిలిపివేసి అధికారంగా ఆదేశాలు వస్తే తప్ప తవ్వకాలు నిర్వహించకూడదని నిర్వాహకులు తెలిపారు.

# శ్రీ పద్మావతి హృదయాలయం డైరెక్టర్, స్మైల్ ట్రైన్ సంస్థ నిర్వాహకురాలికి సిఎం సన్మానం

తిరుపతి, మే 05 టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి హృదయాలయంలో 300 మందికి పైగా చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించిన ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డిని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి శాలువతో సన్మానించి స్వామివారి ప్రసాదాలు అందించారు. అలాగే బర్డ్ ఆసుపత్రిలో గ్రహణ మొర్రి, చెవుడు, మూగ చికిత్సల కోసం స్వచ్చంద సేవలు అందించడానికి ముందుకు వచ్చిన స్మైల్ ట్రైన్ సంస్థ నిర్వాహకురాలు మమత కౌరల్‌ను ముఖ్యమంత్రిశ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి శాలువతో సన్మానించి స్వామివారి ప్రసాదాలు అందించారు. శ్రీ పద్మావతి చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి భూమి పూజ సందర్భంగా గురువారం అలిపిరి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వీరిద్దరి సేవలను సిఎం ప్రశంసించారు. అలాగే వివిధ సంస్థలకు చెందిన వైద్య నిపుణులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. అంతకుముందు ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ముఖ్యమంత్రికి వైద్యులను పరిచయం చేశారు.

## బైకు పైనే బాలుడి మృతదేహం తరలింపు

నెల్లూరు తిరుపతి రుయా ఆస్పత్రి అంబులెన్స్ సిబ్బంది ఘటన మరువక ముందే మరోచోట అదే పరిస్థితి ఏర్పడింది. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందిన బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లి... తిరిగి ఇంటికి తీసుకెళ్లడానికి 108 వాహనాన్ని అడిగితే... నిబంధనలు అంగీకరించవంటూ నిరాకరించారు. ఎవరూ సాయం చేయకపోవడంతో చేసేదేమీ లేక బాలుడి మృతదేహాన్ని ద్విచక్రవాహనంపైనే ఇంటికి తీసుకెళ్లిన దయనీయమైన ఘటన అందరినీ కలచివేసింది.ద్విచక్ర వాహనం పై నే బాలుడి మృతదేహం తరలించని ఘటన మరోసారి జరిగింది. నెల్లూరు జిల్లా సంగంలో అమానుష ఘటన ఇది. బహుర్భుమి కి వెళ్లి కనిగిరి జలాశయం లో ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు పడిపోయారు. శ్రీరామ్ (8) అనే చిన్నారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బంధువులు తరలించారు. అయితే అప్పటికే శ్రీరామ్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. 108 వాహనం ద్వారా మృతదేహాన్ని తమ నివాసానికి చేర్చాలని కుటుంబ సభ్యులు కోరారు. - నిబంధనలు అంగీకరించవని సిబ్బంది సమాధానం చెప్పారు. మహాప్రస్థానం వాహనం అందుబాటులో లేకుడా పోయింది. - ఆటోలు, ఇతర వాహనాలను బ్రతిమాలినా డ్రైవర్లు ఒప్పుకోలేదు. దాంతో, బంధువులు, బైక్ పైన శ్రీరామ్ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.

## శ్రీవారి మెట్టు నడకదారి పునఃప్రారంభం

**- రూ.3.60 కోట్లతో మరమ్మత్తు పనులు పూర్తి చేసి భక్తులకు అనుమతి**

**- టీటీడీ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి**

తిరుమల, మే 05 శ్రీవారి మెట్టు నడక మార్గాన్ని గురువారం ఉదయం టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పునఃప్రారంభించి, ఈ మార్గంలో భక్తులను తిరుమల కు అనుమతించారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, గత ఏడాది నవంబరు 18, 19వ తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు శ్రీవారి మెట్టు మార్గంలో పెద్ద బండరాళ్ళు పడి రోడ్డు, మెట్లు, ఫుట్‌పాత్‌లు, మరుగుదొడ్లు దెబ్బతిన్నాయన్నారు. ఇంజినీరింగ్ అధికారులు యుద్ధ ప్రాతిపాదికన నడక మార్గాన్ని రూ.3.60 కోట్లతో మరమ్మత్తు పనులు పూర్తి చేశారని చెప్పారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలో శ్రీవారి మెట్టు మార్గంలో మరమ్మత్తులు పూర్తి చేసిన ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది కాంట్రాక్టర్లను చైర్మన్ అభినందించారు. ఈ మార్గం గుండా ప్రతి రోజు ఆరు వేల మంది, ప్రత్యేక పర్వదినాల్లో 15 వేల మంది భక్తులు తిరుమలకు చేరుకుంటారన్నారు. శ్రీవారి మెట్టు మార్గంలోనే సాక్షాత్తు శ్రీనివాసుడు తిరుమలకు చేరుకున్నట్లు , శ్రీ కృష్ణదేవరాయులు శ్రీవారిని దర్శించుకున్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోందని వివరించారు.ఇంజినీరింగ్, కాంట్రాక్టర్లకు సన్మానం : అనంతరం శ్రీవారి మెట్టు నడక మార్గంలో త్వరితగతిన మరమ్మత్తులు పూర్తి చేసిన సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ - 2 జగదీశ్వర్ రెడ్డి, ఇఇ సురేంద్రరెడ్డి, ఈరోడ్డుకు చెందిన ఆర్ఆర్ బిల్డర్స్ డిజిఎమ్ ఆర్ముగంను చైర్మన్ శాలువ, శ్రీవారి ప్రసాదాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు, చంద్రగిరి ఎం.ఎల్.ఏ. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, బోర్డు సభ్యులు పోకల ఆశోక్ కుమార్, మొరం శెట్టి రాములు, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, శ్రీనివాసమంగాపురం ఆలయ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, డిఇ రవిశంకర్ రెడ్డి, అదనపు సివిఎస్వో శివకుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బైక్‌పై మృతదేహాన్ని తరలించిన ఘటనపై సీఐ స్పందన

నెల్లూరు బాలుడు మృతదేహాన్ని బైక్‌పై తీసుకువెళ్లిన ఘటనపై బుచ్చిరెడ్డిపాలెం సీఐ కోటేశ్వరరావు స్పందించారు. 108 సిబ్బందిని బ్రతిమిలాడినా నిరాకరించింది వాస్తవమే అని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నావారిని ఆసుపత్రికి తీసుకువెళ్లడానికే 108 అంబులెన్సులు అని చెప్పుకొచ్చారు. చాలా మంది ఆటో వారిని బ్రతిమిలాడిన విషయం కూడా వాస్తవమే అని అన్నారు. ఆటో వారూ పబ్లిక్ సర్వెంట్సే అని తెలిపారు. ఎస్పీ విజయారావు సూచనల మేరకు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నామని అన్నారు. ఆటోలవారు ఎవరైనా ఇలా ప్రవర్తిస్తే, తమ దృష్టికి తేవాలని, కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని సీఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు...!!

## 41 వ డివిజన్ లో 5వ రోజు మీ ఇంటికి మీ కార్పొరేటర్

నెల్లూరు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం పరిధిలోని 41వ డివిజన్లో 5వ రోజు జగనన్న మాట - గడప గడపకు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి బాటలో మీ ఇంటికి మీ కార్పొరేటర్ కార్యక్రమం గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా 41 వ డివిజన్ పరిధిలోని శివగిరి కాలనీ ప్రాంతంలో వైకాపా వైకాపా సీనియర్ నాయకులు మిద్దె మురళీకృష్ణ యాదవ్, స్థానిక డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ సక్రమంగా అందుతున్నాయా, లేదా అనే విషయాన్ని స్వయంగా తెలుసుకున్నారు . రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నెల్లూరు గ్రామీణ నియోజవర్గ పరిధిని అభివృద్ధి సంక్షేమం వైపు శక్తివంచన లేకుండా నడిపించేందుకు కృషి చేస్తున్నారని ఆయన సేవలను కొనియాడారు. పై కార్యక్రమంలో వైసీపీ డివిజన్ ఇంఛార్జ్ అద్దంకి కృష్ణ, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటి సభ్యులు కందుకూరు వెంకటేశ్వర్లు ఆచారి, వైసీపీ నాయకులు బెల్లాన్ని మధసూధన రావు, శివశేషాద్రి, కమలాకర్, అఖిల్, సమీర్ మరియు సచివాలయం వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కడప కడప జిల్లా గోపవరం మండలం పి పి కుంట సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును లారీ డీ కొన్నది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా అయిదు మందికి తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 లో బద్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు రాజస్థాన్ కు చెందిన సురేష్ కుమార్ గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

